జిల్లా కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా
వివరాలు 6లో

లక్ష్యం వైపు దూసుకెళ్తున్నారు!

అంగన్‌వాడీ.. సమస్యల జడి!

పరిశీలన

కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: చిన్నారులకు విద్యాబుద్ధులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు చాలా చోట్ల శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. మండలంలోని కేంద్రాల దుస్థితిని ఎవరికి చెప్పుకున్నా పరిష్కారం కాక ఏళ్ల తరబడి అసౌకర్యాల మధ్య నెట్టుకొస్తున్నారు. కనీసం తాగునీరు అందించని దుస్థితి. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను 'న్యూస్‌టుడే' పరిశీలించగా.



● తుపాకుల గూడెం గుట్టల బోరులోని కేంద్రం ముందు ఉన్న చేతిపంపు పనిచేయడం లేదు. ఇక్కడ గతేడాది నాసికరంగా మరమ్మతులు చేయడంతో టైల్స్ కుంగిపోతున్నాయి.

ఈ విషయాలపై సీడీపీవో ప్రేమలతను వివరణ కోరగా... మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలపై ప్రతిపాదనలు పంపించామని, నిధుల కేటాయింపును బట్టి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మిషన్‌భగీరథ తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, వర్షాలు తగ్గిన తర్వాత ఏటూరు పనులు చేయిస్తామని పేర్కొన్నారు.



ఏటూరులో ఏడాదిన్నర క్రితం రంగులు వేసి మరమ్మతులు చేశారు. భవనం పైకప్పు వర్షానికి ఉరుస్తుండడంతో టార్పాలిన్ కప్పారు. విద్యార్థులను వరండాలో కూర్చోబెడుతున్నారు.

● సింగారంలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు.



కన్నాయిగూడెంలో ప్రమాదకరంగా పైకప్పు

● కంతనపల్లిలోని భవనాలు శిథిలావస్థకు చేరడంతో సమీకృత భవనం నిర్మించారు. ప్రస్తుతం అందులో గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు.



బంగారుపల్లిలో పెంకుటిల్లులో అంగన్‌వాడీ కేంద్రం.

కంతనపల్లి పరిధిలోని బంగారుపల్లి గొత్తికోయ గూడెంలోని భవనం లేక పెంకుటిల్లులో నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో విషపురుగులు సంచరిస్తున్నాయి. వంట చేయడానికి స్థలం, సౌకర్యాలు లేకపోవడంతో ఇంటి నుంచి భోజనం వండి తీసుకువస్తున్నారు.



● వెంకట్రావుపల్లిలో అద్దె ఇంట్లో కేంద్రం నిర్వహిస్తున్నారు. దీంతో పూర్తిస్థాయి సేవలు అందడం లేదు. గంగూడెంలో ప్రమాదకరంగా ఉన్న భవనంలో పాఠాలు చెబుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయపడుతున్నారు. గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సరైన భవనం లేక ఇక్కడే బోధిస్తున్నారు. ఈ కేంద్రం ముందు ఉన్న మురుగు కాల్వపై బండలు ఏర్పాటు చేయకపోవడంతో నడవడానికి అవస్థలు పడుతున్నారు.

సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం

ములుగు టౌన్, న్యూస్‌టుడే: ప్రమాదాలు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా పోలీసు అధికారి శబరీష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ సీసీటీవీ కమాండ్ కంట్రోల్ కెమెరాల రూం, కెమెరాలను బుధవారం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. జిల్లా 370 కెమెరాలతో నిఘా నీడలో ఉందన్నారు. ఎస్పీ, ఓఎస్డీ సహకారం, ప్రజల మద్దతుతో సోలార్ సిస్టంతో వినూత్న రీతిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన పోలీసు అధికారులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారి శబరీష్, ఓఎస్డీ గితే మహేష్, డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలికంగా ఉండేలా మేడారం జాతర పనులు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, న్యూస్‌టుడే: మేడారం జాతరలో చేపట్టే పనులు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విధంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మినీ మేడారం జాతర నిర్వహణపై కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీష్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్న అవి శాశ్వతంగా ఉండకపోవడంతో మళ్లీ ఆ పనులను చేపట్టే పరిస్థితి వస్తోందని, ఇప్పటి నుంచి చేపట్టే పనులు దీర్ఘకాలికంగా ఉండేలా చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్పర్శ్ పథకం ద్వారా జాతరకు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఫ్లోరింగ్ పనులతో పాటు మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు వసతులు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు గతంలో పని చేసిన అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. తాను స్థానిక ఎమ్మెల్యేగా జాతర అదనపు నిధులు కోసం కృషి చేస్తానని తెలిపారు. జిల్లాకు డైనమిక్ కలెక్టర్ రావడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. 2024 జాతర సమయంలో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్లు సీహెచ్. మహేందర్‌జీ, సంపత్‌రావు, మేడారం ఈవో రాజేందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బీ, గిరిజన సంక్షేమం, నీటిపారుదల, విద్యుత్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.

శుద్ధ జలం అందించాలి

ప్రజలకు శుద్ధి చేసిన మంచినీరు అందించాలని మంత్రి సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, తదితర అధికారులతో కలిసి నీటి నాణ్యత, పరిరక్షణ అనే శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మంచినీరు అందించేందుకు సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. అధికారులు నిత్యం గ్రామాలలో పర్యటిస్తూ నీటి సరఫరాపై దృష్టి సారించాలని సూచించారు. కొందరు కావాలనే ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రభుత్వం మంచినీటి సరఫరాకు విడుదల చేస్తున్న ప్రతి పైసా ప్రజలకు ఉపయోగపడే విధంగా అధికారులు చూడాలన్నారు. నిర్లక్ష్యంగా పని చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచినీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. ఆర్‌డబ్ల్యుఎస్‌ఈ మల్లేశం, ఈఈ మాణిక్యం, డీఈ సునీత ఉన్నారు.

విద్యార్థులతో కలిసి అల్పాహారం

మంత్రి సీతక్క ములుగులోని గడిగడ్డ కాలనీలోని ఎస్సీ, ఎస్టీ బాలికల వసతి గృహాలను కలెక్టర్ టీఎస్. దివాకరతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కింద కూర్చుని అల్పాహారం తిన్నారు. విద్యార్థులను వసతులపై ఆరా తీశారు. ఏమైనా అవసరాలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏటీడీవో దేశిరాం, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి లక్ష్మణ్, డీవీహెచ్‌వో కొమురయ్య, డీడబ్ల్యువో శిరీష, డీపీవో దేవరాజ్, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దారు విజయభాస్కర్ పాల్గొన్నారు.

వర్షాల వేళ.. ఒడిసిపడదాం!

ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వ ఉత్తర్వులు





దాహం వేసినప్పుడే ఆలోచిద్దామా..?

ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి.. నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది.. కాంక్రీట్ వనంలో చుక్క నీరు కూడా ఇంకడం లేదు.. మళ్లీ వేసవి వచ్చేవరకు తాగునీటికి కటకటే.. అప్పుడు ఇంకుడు గుంతలు గుర్తుకొస్తాయి.. దాహం వేసినప్పుడే.. బావి తవ్వితే ప్రయోజనం ఉంటుందా..? మరేం చేద్దాం..!

ఇదే తరుణం...

తాజాగా వాన నీటిని ఒడిసిపట్టి.. భూగర్భ జలాల పెంపునకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నడుం బిగించింది. అన్ని పురపాలికలు, నగరపాలక సంస్థల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడు గుంత ఉండాలని ఉత్తర్వులు వెలువరించింది.. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంతో పాటు ఇటు పౌరులూ కదలాలి.

పౌరుల మేలుకొలుపు కోసం..!

నగర పాలక సంస్థతో పాటు పురపాలికల్లో పౌరుల మేలుకొలుపు కోసమన్నట్లు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. జల శక్తి అభియాన్ పథకం కింద 'క్యాచ్ ది రెయిన్' పిలుపుతో ఈ కార్యాచరణ అమలు చేశారు. డోర్నకల్‌లో మున్సిపల్ పాలకవర్గం, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

బాధలన్నీ గట్టెక్కాయి..

ఈ దంపతుల పేర్లు థారియా-రామిని... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చాప్లాతండా వాసులు. వీరింట్లో బోరు నుంచి అంతంతమాత్రంగానే నీరు వచ్చేది. ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాక ఇంటి అవసరాలకు సరిపడా నీరొస్తోంది.. ఇంట్లో వాడిన నీళ్లు నేరుగా ఇంకుడు గుంతలోకి వెళ్తుండటంతో దోమలు, విష పురుగుల బాధ తప్పింది.

న్యూస్‌టుడే-డోర్నకల్, కార్పొరేషన్, జనగామ

భవనాల నిర్మాణాలకు అనుమతిచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఉండేలా తప్పని చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు విధివిధానాలను పొందుపర్చింది. ఇప్పటికే ఉన్న భవనాల్లోనూ నిర్మించాలి. విద్యా సంస్థలు ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్టుమెంట్లు, ప్రైవేటు వాణిజ్య భవనాల్లోనూ తప్పనిసరి. బడా భవనాలకు ఆక్యుపెన్సీ కమ్ కంప్లీషన్ సర్టిఫికెటు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించారో లేదో అధికారులు పరిశీలించాలి.

డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారే లేరు..

భవన నిర్మాణ అనుమతి రుసుములో ఇంకుడు గుంతల డిపాజిట్ చెల్లించి, నిర్మాణం పూర్తయిన పిదప, ఇంకుడు గుంతల డిపాజిట్ రుసుమును వెనక్కి తీసుకోవచ్చు. కానీ, పురపాలికల్లో ఇంకుడు గుంతలు నిర్మించి, రుసుము వెనక్కి తీసుకున్న దాఖలాలు తక్కువే..

మూలుగుతున్న రూ.5 కోట్లు

ఇంకుడు గుంతల నిర్మాణం కోసం గ్రేటర్ వరంగల్ డబ్బులు వసూలు చేసింది. బిల్డింగ్ పర్మిషన్ ఫీజుతో పాటు వాటర్ హార్వెస్టింగ్ ఛార్జీలు తీసుకున్నారు. నివాస గృహాల నుంచి రూ.5 వేలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్య భవనాల నుంచి రూ.10వేల పైనే వసూలు చేశారు. 2003 నుంచి నిధులను ప్రత్యేక ఖాతాలో జమ చేశారు. ఇలా రూ.5 కోట్ల నిధులు మూలుగుతున్నాయి. 2013, 2018లో స్పెషల్ డ్రైవ్ ద్వారా కొంతమంది యజమానులు ఇంకుడు గుంతలు నిర్మించినా అసంపూర్తిగా వదిలేశారు.

కానరాని చైతన్యం

పట్టణ ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు.. భవన నిర్మాణం జరిగిన చోటల్లా ఇంటి ఆవరణ లేదా పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మాణమనేది నామ మాత్రంగా కనిపిస్తోంది.. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో మూడు నెలల క్రితం అధికారులు ఇంటింటా సర్వే చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 300 చదరపు మీటర్లు దాటిన గృహాలు 11,588 ఉన్నాయి. ఇందులో 6,973 ఇళ్లు సర్వే చేయగా.. కేవలం 789 ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించగా 768 వాడకంలో ఉండగా, 21 నిరుపయోగంగా ఉన్నాయి. 6184 ఇళ్లలో లేవని తేలింది.

ఇలా నిర్మిద్దాం

ఇంట్లో వాలు స్థలం ఎంపిక చేసుకోవాలి. అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతు గుంత తవ్వాలి. అడుగు భాగాన సగభాగం 40 మి.మీ కంకర, తర్వాత పావు భాగం 20 మి.మీ కంకర నింపాలి. గుంత కొంత భాగం ఖాళీగా ఉండేలా చూసుకొని దొడ్డు ఇసుకతో నింపాలి. తర్వాత వర్షపు నీటి పైపును ఇంకుడు గుంతలోకి మళ్లించాలి. ఇళ్లలో ఖాళీగా ఉన్న బోర్లను కూడా ఇంకుడు గుంతలా చేసి నీటిని మళ్లించవచ్చు.



ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ

పట్టణాల్లో ఆవాసాలు	3,51,768
అపార్టుమెంట్లు	687
ఇంకుడు గుంతలు	2146

వాహన తనిఖీల్లో చిరుతపులి చర్మం పట్టివేత



వివరాలను వెల్లడిస్తున్న ములుగు ఓఎస్‌డీ మహేశ్ బి.గితే, తాడ్వాయి ఎఫ్‌డీవో వజ్రారెడ్డి

వాజేడు, న్యూస్‌టుడే: చిరుత పులి చర్మాన్ని తరలిస్తున్న వ్యక్తిని పేరూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటన వివరాలను ములుగు ఓఎస్‌డీ, ఇన్‌ఛార్జి ఏఎస్పీ మహేశ్ బి.గితే బుధవారం వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ నుంచి చిరుత పులి చర్మాన్ని తెలంగాణకు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో చంద్రుపట్ల అడ్డరోడ్డు సమీపంలో వెంకటాపురం సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్, వాజేడు అటవీ క్షేత్రాధికారి చంద్రమౌళి, పోలీసు, అటవీ సిబ్బందితో కలిసి బుధవారం వాహన తనిఖీ చేపట్టారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా గోధుమ రంగు సంచిలో చిరుతపులి చర్మాన్ని గుర్తించారు. ఆ వ్యక్తి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భూపాలపట్నం తాలూకా ఊళ్లుర గ్రామానికి చెందిన జాడి మహేందర్‌గా గుర్తించారు. చిరుతపులి చర్మంతో పాటు చరవాణి, ద్విచక్రవాహనం అటవీ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పోరాట స్ఫూర్తిని చాటిన ఐలమ్మ



చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీతక్క, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఏటూరునాగారం రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక వై జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటలను కొనియాడారు. ఆమె స్ఫూర్తితో ప్రజా పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టారని, ఆమె మనుమరాలును రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించి గౌరవించారని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలు చల్లగురుగుల చలపతి, పర్వతాల మంగమ్మలను సన్మానించారు. అనంతరం రజక సంఘం నేతలు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో మహేష్ గీతే బాబాసాహెబ్, నాయకులు పాల్గొన్నారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తులు

ములుగు, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆయుష్ ఆసుపత్రులలో యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ములుగు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.లీచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత ఇంటర్మీడియట్ ఉండాలని, యోగా కోర్సు చేసి ఉండాలన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆయుష్ కమిషనర్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లాలోని నర్సాపురం, ఏటూరునాగారం, తాడ్వాయి, చుంచుపల్లిలో ఆయుష్ ఆసుపత్రులు ఉన్నాయని యోగా శిక్షణకు షెడ్డులు నిర్మించి సిద్ధంగా ఉంచినట్లు వివరించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుకు కసరత్తు

ములుగు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ మొదలైంది. విద్యా బోధనకు ఎలాంటి ఆటంకం కలుగకుండా విద్యార్థుల సంఖ్యను బట్టి సర్దుబాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ములుగు జిల్లాలోని పాఠశాలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలను విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్నారు.



ములుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

జిల్లాలో 335 మంది కొరత..

జిల్లాలో ఇప్పటికే ఉపాధ్యాయ కొరత ఉంది. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు సాధ్యం అవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో మొత్తం 353 పాఠశాలలున్నాయి. 270 ప్రాథమిక, 40 ఉన్నత, 44 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 13845 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం 1405 మంది ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం 1070 మంది ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 335 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మిగులు..

జిల్లాలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి మాత్రమే విద్యార్థుల సంఖ్యను బట్టి మిగిలిన ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు అవకాశాలున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల సంఖ్య తక్కువగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఉన్నత, ప్రాథమికోన్నతలో మినహా ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు సాధ్యం కాదనేది స్పష్టమవుతోంది. జిల్లాలో మొత్తం 40 ఉన్నత పాఠశాలలకు గాను ఏడు పాఠశాలలకు ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంది. 14 పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంటు ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారు. ఎక్కువగా ఉన్న వీరిని ఇతర ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 44 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. 19 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే ఎక్కువ మంది ఉపాధ్యాయులున్నట్లు అంచనా. 12 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంది. అదే విధంగా జిల్లాలో మొత్తం 269 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో ప్రస్తుతం 469 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. మొత్తం 477 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. అయితే 8 మంది ఉపాధ్యాయులు ఇంకా తక్కువగానే ఉన్నారు.

జిల్లాలో పాఠశాలల వారీగా వివరాలు....

పాఠశాలలు	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	పని చేస్తున్న ఉపాధ్యాయులు	కావాల్సిన ఉపాధ్యాయులు	మిగులు
ఉన్నత	44	4501	363	307	56
ప్రాథమికోన్నత, స్కూలు అసిస్టెంటు	44	360	97	84	13
ప్రాథమికోన్నత, ఎస్జీటీ	44	1589	86	91	5 తక్కువ
ప్రాథమిక	269	7240	469	477	8 తక్కువ

ప్రక్రియ కొనసాగుతోంది.. - జి.పాణిని, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలో సర్దుబాటుకు చర్యలు చేపట్టాం. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నా.. ఎక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తిస్తున్నాం. ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేస్తాం.

మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్



జాతీయ పతాకంతో యశ్వంత్

మరిపెడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించి మరో ఘనత సాధించారు. అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ పట్టుదల, కృషి, ఆసక్తితో ప్రపంచంలోని శిఖరాలను అధిరోహిస్తున్నారు. సెప్టెంబర్ 4న ప్రారంభించిన యాత్ర 6488 మీటర్ల ఎత్తైన శిఖరాన్ని 18 రోజుల్లో అధిరోహించి కిందకు దిగినట్లు యశ్వంత్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ అధిరోహించాలనే సంకల్పంతో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సాహస అభిమానులు యశ్వంత్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీందర్, పీఆర్‌టీయూ నాయకులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల సాధన కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని జడ్పీ సమావేశ మందిరంలో సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం కృషితోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరిగాయని చెప్పారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. టీచర్ల సమస్యలు, పాత బకాయిల చెల్లింపులపై సీఎంను కలుస్తామని అన్నారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్ గఫార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.రఘు, ఎ.మహేందర్, ఉపాధ్యక్షులుగా పి.మల్లయ్య, సి.సుధాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా పి.అర్పితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, ప్రతిక సంపాదకులు ఇన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)
వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

లక్ష్యం వైపు దూసుకెళ్తున్నారు!

ప్రతిభ గల పేద క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే.. అద్భుతంగా రాణిస్తారనడానికి ఉదాహరణ ఇది.. సరైన నైపుణ్య శిక్షణ అందిస్తే చక్కటి ఫలితాలు వస్తాయనడానికి తార్కాణమిది.. 'ఈనాడు' సంస్థ తీసుకొచ్చిన 'లక్ష్య' కార్యక్రమం మారుమూల క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొస్తోంది. .. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన జీవాంజీ దీప్తి 'లక్ష్య' ప్రోత్సాహంతో పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా కాంస్య పతకం కొల్లగొట్టింది. ఆమె స్ఫూర్తిగా హనుమకొండ కేంద్రంగా శిక్షణ తీసుకుంటున్న అథ్లెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలతో దుమ్ములేపుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలతో అదరగొట్టారు. ఈ నేపథ్యంలో వారిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

చిరుత వేగంతో..



మహ్మద్ కైఫ్

హుజురాబాద్‌కు చెందిన స్ప్రింటర్ మహ్మద్ కైఫ్ పరుగులో చిరుత వేగంతో పోటీపడతారు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉండటంతో అథ్లెటిక్స్ ఎంచుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 200 మీటర్ల పరుగులో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలతో ప్రతిభ కనబరిచారు. నాలుగు జాతీయ, ఆరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న కైఫ్ స్ప్రింట్స్‌లో రికార్డు టైమింగ్ సృష్టిస్తానని చెబుతున్నారు.

భారత జట్టులో చోటు కోసం..



సబ్బావత్ దత్తు

నల్గొండకు చెందిన దత్తు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నారు. లాంగ్‌జంప్, హెప్టాథ్లాన్‌లో తనదైన ప్రదర్శనతో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన దత్తుకు 'లక్ష్య' కేంద్రం అండగా ఉంటూ ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ఇప్పటివరకు ఐదు జాతీయ స్థాయి, 14 రాష్ట్రా స్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. భారత అథ్లెటిక్స్ బృందంలో చోటు సంపాదిస్తానని అంటున్నారు.

రెండు విభాగాల్లో..



రవితేజ

మంచిర్యాలకు చెందిన రవితేజ 3000 మీటర్ల(ఫ్లాట్ రన్), 3000 మీటర్ల స్టిపుల్ చేస్‌లో అత్యంత ప్రతిభతో రాణించాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో రెండు విభాగాల్లో కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. జాతీయ స్థాయిలో నాలుగు, రాష్ట్ర స్థాయిలో 9 టోర్నీల్లో పాల్గొన్నాడు. అండర్-20 3000 మీటర్ల స్టిపుల్ ఛేస్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలని లక్ష్యంగా సాధన కొనసాగిస్తున్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో రెండో ఏడాది చదువుతున్నారు.

రికార్డు టైమింగ్ నమోదు



గణేష్

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో గణేష్ రికార్డు టైమింగ్ నమోదు చేశారు. 100 మీటర్ల పరుగును 10.83 సెకండ్లలో పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టైమింగ్‌గా కోచ్ నాగరాజు తెలిపారు. నల్గొండకు చెందిన రవితేజ హనుమకొండలోని కేడీసీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నారు. రెండేళ్ల క్రితమే రవితేజ 'లక్ష్య'లో చేరారు. నైపుణ్య శిక్షణ అందడంతో పరుగుకు మరింత పదును పెంచారు. మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలోను రికార్డు టైమింగ్ నమోదు చేస్తానని తెలిపారు.

హనుమకొండ జేఎన్ స్టేడియం కేంద్రం

2019లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కేంద్రంగా ఈనాడు 'లక్ష్య' అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వరంగల్‌కు చెందిన భారత అథ్లెటిక్స్ జట్టు చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ సూచనతో జాతీయ స్థాయి అథ్లెట్ నాగరాజును కోచ్‌గా ఎంపిక చేశారు. కొద్ది మందితో ప్రారంభమైన శిక్షణ అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటే వరకు చేరారు. ప్రస్తుతం 18 బాలురు, ఒక బాలిక తర్ఫీదు పొందుతున్నారు. వారిలో 15 మంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దత్తు, గణేష్ జాతీయ స్థాయిలో ఏకంగా పతకాలు కొల్లగొట్టారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలు

దక్షిణ భారత పోటీలకు..

ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వరంగల్ లక్ష్య అథ్లెట్లు ఏకంగా పది పతకాలు సొంతం చేసుకున్నారు. దత్తు, కైఫ్, గణేష్, శ్రీధర్, రాఘవ, రవితేజ, తరుణ్‌కుమార్ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించారు. కైఫ్, గణేష్, శ్రీధర్, రవితేజ, దత్తులు గుంటూరులో అక్టోబర్ 19, 20న జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో దత్తు, కైఫ్, రవితేజ రెండేసి పతకాలతో సత్తాచాటారు.



హనుమకొండ జేఎన్ స్టేడియంలో శిక్షణలో ఉన్న అథ్లెట్లతో లక్ష్య మెంటర్ నాగపురి రమేష్ (పాత చిత్రం)

ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక

లక్ష్య శిక్షణ శిబిరానికి చెందిన అథ్లెట్లు 2022, 2023 సంవత్సరాల్లో ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో నిరోష్, ఆదిత్య కృష్ణ, రోహిత్, శ్రీను, ప్రవీణ్, అభినవ్, రఘునాథ్, సింగ్, నగేష్ శ్రావణ్‌లు ఉన్నారు. ప్రస్తుతం దేశంలోని వివిధ సైనిక శిబిరాల్లో శిక్షణలో ఉన్నారు.




జనగామ కలెక్టరేట్‌లో ప్రారంభించి భోజనం చేస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, తదితరులు

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో జనగామ జిల్లా సచివాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పాలనాధికారి రిజ్వాన్ బాషాతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య బుధవారం ప్రారంభించి, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి భోజనం చేశారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు ఎంపీ సూచించారు. అనంతరం బిల్లు చెల్లిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా



ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్ బుక్ ఖాతా తెరిచి పలువురికి మెసేజ్‌లు పంపిస్తూ డబ్బులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ అప్రమత్తమై మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దని, వెంటనే దానిని తొలగించాలని పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ పేరులో సమావేశంలో ఉన్నానని అత్యవసరంగా డబ్బులు కావాలని 998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి పలువురికి ఈ సందేశం పంపించి సైబర్ నేరగాడు డబ్బులు ఫోన్ పే చేసి స్క్రీన్ షాట్ షేర్ చేయాలని కోరాడు. దీంతో కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని సూచించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ ఎస్సైలకు ఠాణాల కేటాయింపు

వరంగల్‌క్రైం : పోలీసు శాఖలో ఎంపికై శిక్షణకు కమిషనరేట్‌కు వచ్చిన ఎస్సైలకు ఠాణాలు కేటాయించారు. రెండు ఠాణాల్లో 15 రోజుల చొప్పున విధులు నిర్వర్తించాలి. వివిధ అంశాలపై సీనియర్ అధికారులు అవగాహన కల్పిస్తారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 9 వరకు, అక్టోబర్ 10 నుంచి 24 వరకు రెండు విడతల్లో శిక్షణ పొందుతారు.

ప్రతిభ చాటేందుకు.. యువజనోత్సవం

స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా యువత ప్రతిభ చాటేందుకు అవకాశం కల్పిస్తోంది. రాష్ట్ర సంచాలకుడు, యువజన సర్వీసుల శాఖల ఆదేశాల మేరకు పాలనాధికారి అధ్యక్షతన జిల్లా యువజన, క్రీడల ఆధ్వర్యంలో ఈ నెల 28న యువజనోత్సవాలను నిర్వహించనున్నారు. జానపద నృత్యాలు, జానపద గేయాలు విభాగంలో వ్యక్తిగత, బృంద పోటీలు ఉంటాయి. కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ రూపకల్పన, వక్తృత్వ పోటీలు ఉంటాయి. సైన్స్ మేళాను యువజనోత్సవాల్లో మొదటిసారి ప్రవేశపెట్టారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలు ప్రవేశపెట్టారు. యువత సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించవచ్చు. యువకృతి విభాగంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన హస్తకళలను అర్థం చేసుకోడానికి యువజన క్రీడల శాఖ అవకాశం కల్పిస్తోంది. దీని కోసం హస్త కళలు, వస్త్రాలు, వ్యసాయ ఉత్పత్తులు, తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు వ్యక్తులు ముఖాముఖిలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. యువజనోత్సవాలను యువతీ యువకులకు మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఈ నెల 28న, రెండో దశ హైదరాబాద్‌లో, మూడో దశ జనవరి 12-16 వరకు కర్ణాటకలో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయి. 15 నుంచి 29 ఏళ్ల మధ్యనున్న యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి కోరారు.



జానపద నృత్యం చేస్తున్న బృందం (పాత చిత్రం)



–న్యూస్‌టుడే, ములుగు టౌన్

నైపుణ్య ప్రదర్శనకు.. కళా ఉత్సవ్

విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ దశల్లో ప్రతిభ చాటేందుకు ఎన్‌సీఈఆర్టీ, తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్తంగా 'కళా ఉత్సవ్' పేరుతో పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోటీల నిర్వహణకు విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు ఏదైనా కళను ప్రదర్శించవచ్చు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి. మండల, జిల్లా స్థాయి పోటీలు జిల్లా విద్యాధికారుల సూచనల మేరకు ఈ నెలాఖరు నాటికి నిర్వహిస్తారు. అక్టోబరులో రాష్ట్ర స్థాయి, నవంబరులో జాతీయ స్థాయిలో పోటీలు జరగనున్నాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన కళాకారులకు నగదు బహుమతులు, పథకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్యకళ, సంప్రదాయక కథ చెప్పడం వంటి అంశాలపై ప్రధానంగా పోటీలు ఉంటాయి. ఉప అంశాలైన జానపద, క్లాసికల్ నృత్యాలు, సంగీతం, సంప్రదాయ చిత్రాలు, హిందుస్థానీ, కర్ణాటక, జానపదం, చిత్రలేఖనం, శిల్పకళ, కథలు చెప్పడం, నాటకంలో కళాకారులు తమ ప్రతిభ చూపవచ్చు. 'వివిధ కళల్లో విద్యార్థులు ప్రతిభ చాటేందుకు 'కళా ఉత్సవ్' ఓ మంచి వేదిక.. జిల్లా విద్యాధికారి సూచనల మేరకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని అకాడమిక్ క్వాలిటీ సమన్వయకర్త కె.లక్ష్మణ్ చెప్పారు.



నృత్యం చేస్తున్న విద్యార్థిని(పాతచిత్రం)

– న్యూస్‌టుడే, భూపాలపల్లి, మానుకోట

పనులు వేగిరం.. దక్కిన ఫలితం

ఎన్‌హెచ్‌సీ పోటీల్లో ఓరుగల్లు సత్తా



దిల్లీలో స్మార్ట్‌సిటీ ఎండీ రాహుల్ కపూర్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న గ్రేటర్ వరంగల్ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, చిత్రంలో ఏఈ కార్తీక్‌రెడ్డి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చారిత్రక ఓరుగల్లు మహా నగరానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నైబర్ హుడ్ ఛాలెంజ్(ఎన్‌హెచ్‌సీ) పోటీల్లో గ్రేటర్ వరంగల్ సత్తా చాటింది. బెంగళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చితో పాటు వరంగల్ నగరానికి నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో 'ఎక్సలెన్స్ సర్టిఫికెట్' దక్కింది. బుధవారం దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్మార్ట్‌సిటీ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈ కార్తీక్‌రెడ్డి ఎక్సలెన్స్ ధ్రువపత్రం అందుకున్నారు.

ఎందుకు వచ్చిందంటే..!

దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 స్మార్ట్‌సిటీ నగరాలకు మూడేళ్ల క్రితం మొదటి దశలో నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ పేరుతో నిధులు కేటాయించారు. స్మార్ట్‌సిటీ మిషన్ జారీ చేసిన నిర్ణీత సమయంలో అధికారులు వరంగల్ దేశాయిపేట ఎంహెచ్‌నగర్‌లో 56 గంటల్లో చిట్టి పార్కు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా క్రిస్టియన్ కాలనీ, కరీమాబాద్ గుండుబావి, హనుమకొండ శ్రీనగర్ కాలనీలో పార్కులు సిద్ధం చేశారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలో బుద్ధ ప్లాజాను నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. ఈ వివరాలన్నీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు దక్కింది.

వరంగల్‌కు గర్వకారణం

- గుండు సుధారాణి, మేయర్

'నైబర్ హుడ్ ఛాలెంజ్' పోటీల్లో వరంగల్ నగరానికి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ దక్కడం గర్వంగా ఉంది. ఈ స్ఫూర్తితో నగర సుందరీకరణ కొనసాగిస్తాం. రెండో దశ పోటీ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇవ్వనుంది. వాటితో మరిన్ని పార్కులు అభివృద్ధి చేస్తాం.



పార్కు ముఖ ద్వారం పరిస్థితి ఇది



నిలిచిన వర్షం నీరు

సరిగమ.. నిర్వహణ మమ!

ఫోకస్



కూలిన స్తంభాలు



దొంగల పాలైన శిల్పాల ముందు లైట్లు

ఒకప్పుడు ఆ పార్కులోకి వెళ్తే సప్త స్వరాలు వింటున్న అనుభూతి కలిగేది. . శిల్ప సౌందర్యం, పచ్చని పరిసరాలు ఆహ్లాదంగా కనిపించేవి.. నేడు మాత్రం విరిగిన ముఖద్వారం తాలూకు శిల్పాలు, అక్కడక్కడా అందమైన శిల్పాలకు పెట్టిన లైట్లు దొంగలపాలయ్యాయి. నిర్వహణ లేక ఆ పార్కు ఇలా కనిపిస్తోంది. లక్షలు వెచ్చించి ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. హనుమకొండలోని పద్మాక్షి రోడ్‌లోని సరిగమ పార్కు దుస్థితి ఇది. – ఈనాడు, హనుమకొండ

రాష్ట్రస్థాయి జూడో పోటీలు షురూ!

వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి జూడో పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి పోటీలు పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రునాయక్ మాట్లాడుతూ.. సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించినట్లు వివరించారు. ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివిధ జిల్లాల కోచ్‌లు, ప్రభుత్వ పీఈటీలు పాల్గొన్నారు.



ఆదమరిస్తే ప్రమాదం..!

వెంకటాపురం మండలం వీరభద్రవరం సమీపంలోని రహదారి కోతకు గురైంది. పెద్ద ఎత్తున గండి పడటంతో ప్రమాదం పొంచి ఉంది. వెంకటాపురం-భద్రాచలం ఆర్‌అండ్‌బీ మార్గంపై నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. ప్రమాద సూచికగా టైరు, కర్రను ఏర్పాటు చేసినా ప్రయోజనం లేదు. అధికారులు తక్షణమే స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వెంకటాపురం

దివ్యాంగ లక్షణాల గుర్తింపునకు ప్రశస్త్

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పిల్లలకు దివ్యాంగ లక్షణాలు బాల్యంలోనే కనిపించినా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంతగా శ్రద్ధ వహించకపోవడంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ అది కనువుతోంది. ఇందుకు నివారణగా వీరిని ఉపాధ్యాయులు ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే మెరుగైన జీవనం గడపగలరని జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి(ఎన్సీఈఆర్టీ) సంకల్పించింది. ఇందుకోసం దేశ వ్యాప్తంగా మూడంచెల నిర్ధారణ కార్యక్రమాలకు నిర్ణయించింది. ఇందులో భాగంగా రిసోర్సు పర్సన్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి..

● విద్యార్థులు సచేతనంగా ఉన్న సమయంలో ఉపాధ్యాయుల సమక్షంలోనే ఎక్కువగా ఉంటారు. ఈ క్రమంలో వారిని పాఠశాలలో సునిశితంగా గమనించే వీలుంటుంది. వారిలో దివ్యాంగ లక్షణాలు ఉంటే గుర్తించడానికి ప్రశస్త్ యాప్‌ను రూపొందించింది. ప్రధానోపాధ్యాయుడి మెయిల్ ఐడీ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. మొత్తం 21 రకాల వైకల్యాలను గుర్తించిన విద్యాశాఖ తొలుత విద్యార్థులను ఉపాధ్యాయుడు కనీసం రెండు వారాల పాటు గమనించి విద్యార్థి వివరాలను నమోదు చేయాలి. రెండో దశలో శిక్షణ పొందిన నిపుణులు గమనించినట్లు నమోదు, మూడో దశలో ఆ లక్షణాలున్న విద్యార్థి తల్లి లేదా తండ్రిని పిలిపించి గుర్తించిన రుగ్మతలను వివరించి, అనుమతి తీసి పరీక్షకు పంపిస్తారు. చివర్లో చికిత్స అందించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని కౌన్సెలింగ్, నిపుణులతో కూడా మాట్లాడిస్తారు. వారి అనుమతితో విద్యార్థిని ఉన్నత స్థాయి పరీక్షకు పంపించి, ధ్రువపత్రం అందజేస్తారు. అక్కడి నుంచి సదరు విద్యార్థి ప్రత్యేక ప్రతిభావంతుడిగా గుర్తింపబడతాడు. మొదట తనకు దివ్యాంగ లక్షణాలు పరీక్ష చేస్తున్నామనే భావన కలగకుండా రిసోర్సు పర్సన్లు జాగ్రత్తలు తీసుకుంటారు. మొదటి దశ నివేదికలు అక్టోబర్ 26వ తేదీ వరకు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.



ప్రశస్త్ యాప్ అంతర్జాల పుట

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం పంచాయతీలోని పాత సీపీఎం కార్యాలయం వీధిలోని కల్వర్టులో మురుగు పూడుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వ్యర్థాలను తొలగించాలి. **- శ్రీకాంత్, స్థానికుడు**

కార్మికులతో కల్వర్టు శుభ్రం చేయిస్తాం **- ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

● వెంకటాపురంలోని ప్రధాన రోడ్డుపై పశువులు సంచరిస్తున్నాయి. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. **- రామారావు, వాహనదారుడు**

సమాధానం: చర్యలు తీసుకుంటాం: **- ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

● బోదాపురంలోని పలు వీధుల్లో దీపాలు వెలుగక ఇబ్బందులు పడతున్నాం. సమస్య పరిష్కరించాలి. **- సమ్మయ్య, స్థానికుడు**

వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం **- హనుమంతరావు, ఎంపీవో**

యువకుడి ప్రాణాలను కాపాడిన ఎస్సై

తాడ్వాయి, న్యూస్‌టుడే: క్షణికావేశంలో రసాయన ద్రావణం తాగిన ఓ యువకుడి ప్రాణాలను ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కాపాడారు. నార్లాపూర్‌కు చెందిన ఓ యువకుడు మంగళవారం సాయంత్రం తల్లిదండ్రులతో గొడవపడి ఇంట్లో నుంచి సమీప అడవిలోకి వెళ్లిపోయాడు. ద్రావణం తాగి తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. అప్పటికే చీకటి కావడంతో ఆందోళన చెందిన ఆతడి తల్లిదండ్రులు ఎస్సైకి సమాచారం అందించారు. ఎస్సై అంతర్జాలంలో యువకుడు ఉన్న ప్రదేశాన్ని గుర్తించి పోలీసులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని అపస్మారకస్థితిలో ఉన్న యువకుడిని ఆసుపత్రికి తరలించారు.

నాణ్యతా ప్రమాణాలతో నియంత్రికల మరమ్మతులు



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

బాలసముద్రం, న్యూస్‌టుడే : విద్యుత్తు నియంత్రికల మరమ్మతులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, ఈ మేరకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. ఎస్పీఎం షెడ్ల నిర్వాహకులు, అందులో పని చేసే సిబ్బందికి హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్తు భవన్‌లో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నియంత్రికల వైఫల్యాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి జిల్లాలో ఆదర్శవంతంగా ఎస్పీఎం షెడ్లు నెలకొల్పుతామని అన్నారు. ఈ నెల 29 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని చెప్పారు. విద్యుత్తు భవన్ అధికారులు సదర్‌లాల్, మధుసూదన్, కేఎన్.గుట్ట, అన్నపూర్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

పస్రా,(గోవిందరావుపేట),న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి చెప్పారు. మండలంలోని పస్రా గ్రామంలో బుధవారం సీపీఎం జెండా ఆవిష్కరించారు. గ్రామ మహాసభకు హాజరై ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా గ్రామాల్లో మురుగు కాల్వల నిర్మాణం, అంతర్గత రహదారులు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, గతంలో రక్షిత మంచినీటిని సీపీఎం ప్రజలకు అందిస్తే తర్వాత వచ్చిన సర్పంచి దానిని పూర్తిగా ధ్వంసం చేశారని, జనాభా ప్రాతిపాదికన జరిగే అభివృద్ధి జరగకపోవడానికి కారణం ఎవరనేది ప్రజలకు తెలుసని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రభుత్వం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పని చేసే వారికే ప్రజలు పట్టం కట్టాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నేతలు తుమ్మల వెంకట్‌రెడ్డి, తీగల ఆగిరెడ్డి, చిట్టిబాబు, సాంబశివ, రాజేందర్, రాజేశ్, మల్లారెడ్డి, పురుషోత్తంరెడ్డి, ధర్మారెడ్డి, చంద్రారెడ్డి, ఎతదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా యువతను చైతన్య పరిచేందుకు జిల్లా పోలీసు అధికారి శబరీష్ ఆధ్వర్యంలో జాకారం గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. మొదటి స్థానంలో వాజేడు, ద్వితీయ ఏటూరునాగారం జట్లకు కప్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ శబరీష్, ఓఎస్డీ గితే మహేష్, డీఎస్పీ రవీందర్, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గోవిందరావుపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఫార్మాసిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింత వినోదర్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిస్టుల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో డీఏఓ రణధీర్, వైద్యాధికారులు శ్రీకాంత్, చంద్రకాంత్, నాయకులు శ్రీనివాస్, హిమకిరణ్, సంధ్యారాణి, స్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

నడిస్తే బండి లేకుంటే మొండి



ఇది ఏటూరునాగారం బస్టాండులో ఆర్టీసీ బస్సు పరిస్థితి. నడిస్తే బండి లేకుంటే మొండి అనే రీతిలో బస్సుల పరిస్థితి తయారైంది. బుధవారం హనుమకొండ నుంచి ఏటూరునాగారం వరకు వచ్చి ఆగి పోయింది. అది చేసేది లేక ప్రయాణికులు బస్సును తోయడంతో స్టార్ట్ అయింది. దీంతో హమ్మయ్య అంటూ ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. –ములుగు, న్యూస్‌టుడే

ఉపాధ్యాయ హక్కుల సాధనకు ఉద్యమం



ఊరట్టంలో..

తాడ్వాయి, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘాల ఐకాస సభ్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ బృందం బుధవారం ఊరట్టం ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ చేసిన బదిలీలు, పదోన్నతుల్లో ఉపాధ్యాయుల అప్పీళ్లకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వలేదన్నారు. కౌన్సెలింగ్‌లో సైతం చాలా పోస్టులను ఖాళీలుగా చూపలేదన్నారు. గిరిజన ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయంపై ఈ నెల 28న ఏటూరునాగారం ఐటీడీఏ ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పొదెం కృష్ణప్రసాద్, గొప్ప సమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి..

వెంకటాపూర్: గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో జరిగిన అవకతవకలపై ఈ నెల 28న ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టే గిరిజన ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజు అన్నారు. బుధవారం మండలంలోని భూరుగుపేట ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయులను ఆయన కలిశారు. సమస్యలపై వారితో చర్చించారు. ప్రతి ఉపాధ్యాయుడు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, మైపతి సంతోష్, ఉపాధ్యాయులు రమేష్, జవహర్‌లాల్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజ్మీరా రాజు

సమస్యలపై కాలయాపన..

ఏటూరునాగారం: గిరిజన సంక్షేమ విద్యాశాఖలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల విషయంలో క్లారిఫికేషన్ పేరిట డీడీ పోచం కాలయాపన చేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల ఐకాస నేతలు జి.సమ్మారావు, పి.కృష్ణప్రసాద్, సమ్మయ్య తదితరులు ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని చిన్నబోయినపల్లిలో ఐకాస నాయకులు సమావేశం నిర్వహించారు. 7 ఏళ్లుగా తమ శాఖలో బదిలీలు, పదోన్నతులు లేవన్నారు. 41 పోస్టులు ఖాళీగా ఉన్నా కేవలం 5 పోస్టులకు మాత్రమే పదోన్నతులు కల్పించారని, మిగిలిన పోస్టులకు పదోన్నతి కల్పించకుండా ఉపాధ్యాయులకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల విషయంలో న్యాయం చేయాలన్నారు. విద్యా శాఖలో నెలకొన్న సమస్యను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సూచనల మేరకు పీవో పరిష్కరించాలని కోరారు. ఈ నెల 28న ఐకాస ఆధ్వర్యంలో ఐటీడీఏ ఆవరణలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.



చిన్నబోయినపల్లిలో నినాదాలు..

ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం



చల్పాక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: కిశోర బాలికలు సమతులాహారం, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో ప్రేమలత సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాల, చల్పాక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కిశోర బాలికలకు ఐసీడీఎస్, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను పరీక్షించారు. బాలామృతం ప్రత్యేకత, తల్లులు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహార నియమాలపై రొయ్యూరు వైద్యాధికారి సుమలత పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యాయామం, యోగాతో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, పుష్పావతి, విద్యార్థినులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వెంకటాపురం : కాలానుగుణ వ్యాధులపై గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి స్నేహ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వైద్యా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. చొక్కాల, రంగరాజపురం, మంగవాయి, వీరభద్రవరం, ఆలుబాక, తిప్పాపురం, ఎదిర కాలనీ, రామచంద్రాపురంలో వైద్య సేవలందించారు. వైద్య బృందాలు ఇంటింటా అవగాహన కల్పించారు. జ్వర బాధితుల వివరాలను సేకరించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పౌష్టికాహార లోపంతో ఉన్న చిన్నారుల వివరాలను సేకరించారు. పలు ఆరోగ్య ఉప కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో చిన్నారులకు టీకాలు అందించారు. వైద్యులు ఆశీశ్, వినయ్, ఎంఎల్‌హెచ్‌పీ మనోహర్, ఏఎన్ఎంలు విమల, భారతీ, సుశీల, స్వరూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాజేడు : ఏడ్జర్లపల్లి కొత్తూరులో పల్లె దవాఖాన ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు జ్ఞానస 42 మందిని పరీక్షించి మందులు అందించారు. గ్రామంలో రెండో విడత దోమల మందు పిచికారీని ప్రారంభించారు. కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమ తెరలను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వైద్యపర్యవేక్షకులు వెంకటరమణ, కోటిరెడ్డి, వైద్యసహాయకుడు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరేన్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ములుగు, న్యూస్‌టుడే: ములుగు గిరిజన భవన్‌లో పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 1998-99 లో పదో తరగతి చదివిన విద్యార్థినులు కలిశారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దని వినతి



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు తొలగింపు నిర్ణయాన్ని ముఖ్యమంత్రి వెనక్కి తీసుకోవాలని.. పేరు మార్చవద్దని ఏటూరునాగారం మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణకు వచ్చిన మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు.

పంపు ఆపరేటర్లకు శిక్షణ తరగతులు



వాజేడు, న్యూస్‌టుడే: మండలంలోని మంచినీటి పథకం పంపు ఆపరేటర్లకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి 4 రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. నల్ జల్ మిత్ర ప్రోగ్రాం (ఎన్‌జేఎంపీ) కార్యక్రమంలో భాగంగా మండలంలోని 17 గ్రామ పంచాయతీల పంపు ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. మిషన్ భగీరథ తాగునీరు అందించడంలో అప్రమత్తంగా ఉండాలని డీఈఈ సతీశ్ సూచించారు. లీకేజీలు, మరమ్మతులపై వివరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈ సతీశ్, ఎంపీడీవో విజయ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలజ తదితరులు ఉన్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక

ములుగు, న్యూస్‌టుడే: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగులో నిర్వహించనున్న రావణాసుర వధ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండ్రకోట కుమార్, ఉపాధ్యక్షులుగా రాసమల్ల శివాజి, ఓడ రాజు, గాదం దేవేందర్, గుండెవేణ రమేష్, అనుముల సురేష్, ఎల్కతుర్తి శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా గందె రాజు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ గండ్రకోట కుమార్ ఉత్సవాల నిర్వహణకు 10 వేలు విరాళం అందించారు.

పండిట్ ఆశయాల బాటలో పయనించాలి



పస్రాలో..

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: భాజపా అగ్ర నాయకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆశయాల బాటలో భాజపా నాయకులు పయనించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పిలుపునిచ్చారు. దీన్ దయాళ్ జయంతిని పురస్కరించుకుని పస్రాలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. భారతీయ జన సంఘ్ పేరుతో పార్టీని స్థాపించిన ముఖ్యులలో దీన్ దయాళ్ ఒకరని చెప్పారు. తను నమ్మిన సిద్ధాంతం కోసం జీవిత పర్యంతం పని చేసిన గొప్ప నాయకుడని ఆయన త్యాగాలను కొనియాడారు. ఆ మహా నాయకుడు చూపిన బాటలోనే నేటి భాజపా అగ్ర నేతలు పయనిస్తూ ప్రపంచంలో భారతదేశాన్ని తిరుగులేని అద్భుత శక్తిగా మారుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రవీంద్రాచారి, వెంకట్, లవణ్, రవీందర్‌రెడ్డి, కృష్ణాకర్, సురేశ్, సుధాకర్ రెడ్డి, ప్రశాంత్, సావిత్రమ్మ, సాంబశివరెడ్డి పాల్గొన్నారు.

మంగపేట: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని గంపోనిగూడెంలో భాజపా నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా సభ్యత్వ ఇన్‌ఛార్జి మండల లవన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నరేష్, వెంకట్, ఎండి.యాకూబ్‌పాషా, వీరన్‌కుమార్, సాంబయ్య, నిడదవోలు శ్రీనివాస్, నవీన్, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గంపోనిగూడెంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నాయకులు

తాడ్వాయి: భాజపా సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ పండిట్ జయంతిని ఆ పార్టీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం కార్యక్రమానికి హాజరై పలువురికి పార్టీ సభ్యత్వాలు అందించారు. కార్యక్రమంలో నాయకులు భర్తపురం నరేష్, జాడి వెంకట్, రుద్రారపు సురేష్, ద్యాగల సలేందర్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాయకులు

మండల విద్యాశాఖ అధికారిగా మేనక



మంగపేట, న్యూస్‌టుడే: మంగపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పొదెం మేనకను మండల విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ బుధవారం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌ఛార్జి మండల విద్యాశాఖ అధికారిగా పని చేసిన రాజేశ్‌కుమార్ దామెర మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మేనక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్సీ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు పీఆర్టీయూ, యూటీఎఫ్ నాయకులు సన్మానించారు.

తాడ్వాయి మండలానికి కేశవరావు..



కేశవరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండల విద్యాధికారిగా ఇందిరా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేగ కేశవరావు నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన సాంబయ్య హనుమకొండ మండలం గీసుగొండకు బదిలీపై వెళ్లారు. దీంతో కేశవరావును మండల విద్యాధికారిగా నియమిస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన కేశవరావును ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు.

పీఆర్టీయూ జిల్లా కార్యవర్గంలో చోటు

మంగపేట, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఈ నెల 24న జరిగిన పీఆర్టీయూ జిల్లా ఎన్నికల్లో మండల వాసులకు కార్యవర్గంలో చోటు దక్కినట్లు పీఆర్టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చందా భద్రయ్య, మద్దెల నాగేశ్వర్‌రావు బుధవారం తెలిపారు. కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యక్షులుగా పెట్రం సుధాకర్‌రావు, పి.సాంబశివరావు, కార్యదర్శులు నర్సింగరావు, వేణుమాధవరెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శిగా ఈసం అనసూర్య ఎన్నికైనట్లు చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న కళ్యాణి

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కళ్యాణి చెప్పారు. గోవిందరావుపేటలో బుధవారం నాగమణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, గృహజ్యోతి పథకం అమలు చేశారన్నారు. రూ.500 లకే గ్యాస్ పథకాన్ని అమలు చేశారన్నారు. తక్కువ వడ్డీతో మహిళలకు రుణ సౌకర్యం కల్పించారని, త్వరలో మహాలక్ష్మీ పథకం ద్వారా ప్రతి మహిళలకు నెలకు రూ. 2500 సాయాన్ని అందజేస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను నెరవేరుస్తారని చెప్పారు. మహిళలు కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతం



కోటగుళ్లలో పూజలు చేస్తున్న రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ గిరిధర గోపాల్

గణపురం, న్యూస్‌టుడే: గణపురంలో కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతమని రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ గిరిధర గోపాల్ అన్నారు. ఆయన బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి కోటగుళ్లను సందర్శించారు. స్థానిక పాత్రికేయుడు తాళ్లపల్లి యాదగిరి ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. గిరిధర గోపాల్ మాట్లాడుతూ కోటగుళ్లతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, గతంలో ములుగు సబ్ కలెక్టర్‌గా, ఐటీడీఏ పీవోగా పని చేసినప్పుడు అందరి సమన్వయంతో మేడారం జాతర నిర్వహించానన్నారు. రామప్పను పోలిన శిల్ప సంపద ఇక్కడుందని, మరోసారి కోటగుళ్లను సందర్శిస్తానన్నారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజేందర్, ఆర్ఐ దేవేందర్, రహమత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి రిమాండ్

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని ఇస్లావత్ తండా మాజీ ఉప సర్పంచి ఫోర్జరీ సంతకం చేసిన కేసులో మాజీ సర్పంచి ఇస్లావత్ నరేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కురవి ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఇస్లావత్ తండా నరేష్ సర్పంచిగా ఉన్న సమయంలో ఉపసర్పంచి సంతకం ఫోర్జరీ చేసి బ్యాంకు నుంచి రూ. 49వేలు విడిపించుకున్న విషయంలో అప్పటి ఎంపీవో హరిప్రసాద్ విచారణ చేసి కురవి ఠాణాలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఉప సర్పంచి సంతకం ఫోర్జరీ చేసిన విషయం వాస్తవమేనని ల్యాబ్ నివేదిక రాగా నరేష్‌ను అరెస్టు చేసి జుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.